# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 20 మార్చి 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 222





చలాన్లు చెల్లించకపోతే డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ ఫ్రీజ్!


PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




# అంతర్జాతీయ సినిమాకు గమ్యస్థానంగా హైదరాబాద్

తెలంగాణ గద్దర్ సినీ అవార్డుల ప్రదానోత్సవంలో.. చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, బాలీవుడ్ నటి మాధురీదీక్షిత్. పైడి జయరాజ్ పురస్కారం అందుకున్న కమల్‌హాసన్. జయసుధకు అక్కినేని నాగేశ్వరరావు ఫిల్మ్ అవార్డు అందిస్తున్న నాగార్జున

**ఇదే మా ప్రభుత్వ లక్ష్యం**

**అనుమతులకు సింగిల్ విండో విధానాన్ని తీసుకొస్తాం**

**ఇక్కడ పెట్టుబడులు పెట్టండి.. సురక్షితంగా ఉంటాయి**

**గద్దర్ ఫిల్మ్ అవార్డుల వేడుకలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్: "ప్రపంచ సినీ పరిశ్రమను తెలంగాణకు రప్పించాలని మేము కృషిచేస్తున్నాం. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తెలంగాణలో అందుబాటులో ఉంది. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌లో జీసీసీ పెట్టిందంటే.. హాలీవుడ్ ఇక్కడికి వచ్చినట్టే. హైదరాబాద్ వేదికగా అంతర్జాతీయ సినిమాల నిర్మాణాన్ని మా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సినిమాలకు సంబంధించిన అనుమతుల కోసం వేర్వేరు చోట్లకు తిరగాల్సిన పనిలేకుండా.. సింగిల్ విండో విధానాన్ని తీసుకొస్తాం. కథతో వస్తే.. సమస్తం పూర్తి చేసుకొని బయటకు వెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉంది. ఆన్‌లైన్‌లోనే పర్మిషన్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. అంతర్జాతీయ సినిమాలకు గమ్యస్థానంగా హైదరాబాద్‌ను మార్చడమే నా లక్ష్యం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ హైటెక్స్‌లో గురువారం నిర్వహించిన తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హిందీ నటుడు అనిల్‌కపూర్ గద్దర్ అవార్డులపై వీడియో సందేశం ఇచ్చారు. అవార్డుల ప్రదానం అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. "సినిమాను పరిశ్రమగా పరిగణించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ నగరం అంటే ఐటీ, ఫార్మా, హైదరాబాద్ బిర్యానీ మాత్రమే కాదు.. దేశ స్థాయిలో సినీ పరిశ్రమకు ఒక కేంద్రంగా రాణించాలని మా ప్రజా ప్రభుత్వం భావిస్తోంది.



# ఇది రైతు నామ సంవత్సరం



శ్రీపరాభవ నామ సంవత్సర పంచాంగాన్ని విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. చిత్రంలో విజయారెడ్డి, అలేఖ్య పుంజాల, వెన్నెల గద్దర్, వేం నరేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, మహేశ్‌కుమార్ గౌడ్, కొండా సురేఖ, మల్‌రెడ్డి రంగారెడ్డి, హనుమంతరావు, ఏనుగు నరసింహారెడ్డి, సంతోష్‌కుమార్ శాస్త్రి తదితరులు



హైదరాబాద్:రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును రాజును చేయాలన్న లక్ష్యంతో తమ ప్రజాప్రభుత్వం ముందుకెళ్తోందని, ఇది రైతు నామ సంవత్సరమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో గురువారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. "రైతులు బాగున్నప్పుడే రాష్ట్రం సుఖశాంతులతో ఉంటుంది. తెలంగాణలో 70% వ్యవసాయ ఆధారిత కుటుంబాలే. అందుకే రూ.2 లక్షల రుణమాఫీతో రైతులను రుణ విముక్తుల్ని చేశాం. తెలంగాణలో రైతు రుణభారం అతి తక్కువగా ఉన్నట్లు కేంద్రం ఇటీవల ప్రకటించడం రాష్ట్రానికి గర్వకారణం. రైతుభరోసా కోసం రూ.18 వేల కోట్లు ఖర్చు చేశాం. ఈ నెల 22 నుంచి మళ్లీ మరోవిడత రైతు భరోసా ప్రారంభమవుతుంది. పంటకు గిట్టుబాటు ధరతోపాటు బోనస్ అందిస్తున్నాం. ధరణి... రైతుల పాలిట భూతమై బాధపెడుతుంటే... భూభారతిని తీసుకొచ్చి వారి కష్టాలను తీర్చాం. సాదాబైనామాల భూములపై త్వరలోనే రెవెన్యూ శాఖ పరిష్కారం చూపించబోతోంది.

**అన్నదాతను రాజును చేయడమే లక్ష్యం**

**22 నుంచి రైతు భరోసా ప్రారంభం**

**ఉగాది వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి**




# ప్రభుత్వ వైఫల్యంతో ప్రతిపక్షానికి పెరగనున్న బలం

తెలంగాణ భవన్‌లో పంచాంగ పఠనంలో పండితులు హాజరైన కేటీఆర్, నేతలు తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పాల్గొన్న కేటీఆర్, మధుసూదనాచారి, పొన్నాల, సుధీర్‌బాబు, వద్దిరాజు రవిచంద్ర తదితరులు

హైదరాబాద్: ప్రభుత్వంలోని లోటుపాట్లు, పాలనా వైఫల్యాలు కొనసాగితే.. ప్రజల్లో అసంతృప్తి పెరిగి, ప్రతిపక్షానికి గణనీయంగా బలం చేకూరే అవకాశం ఉందని పండితులు అభిప్రాయపడ్డారు. విద్యావిధానంలో జరుగుతున్న మార్పులు విద్యార్థులకు నష్టాన్ని కలిగించే ప్రమాదం ఉందని, యువత పక్కదారి పట్టే అవకాశం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోతే నిరుద్యోగం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఉగాది సందర్భంగా గురువారం పంచాంగ పఠనం జరిగింది. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ప్రముఖ పండితులు మృత్యుంజయశర్మ, ఫణీంద్రశర్మ పంచాంగ పఠనం చేశారు. "అంతర్జాతీయంగా విదేశీ శక్తుల కుట్రలను మన దేశ సైనికులు సమర్థంగా ఎదుర్కొంటారు. అయితే ఇరుగుపొరుగు దేశాలతో కొన్ని ఉద్రిక్తతలు లేదా ఘర్షణలు చోటుచేసుకునే అవకాశముంది. వ్యవసాయ రంగంలో పురోభివృద్ధి ఉంటుంది. రైతుల ఆత్మహత్యలు తగ్గే సూచనలు ఉన్నాయి. బంగారం, వెండి, ఆహారధాన్యాల ధరలు పెరిగే అవకాశం ఉంది" అని పండితులు పేర్కొన్నారు.




వేగుచుక్క

# పది పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జోరు.

**నిజామాబాద్ రూరల్ సెంటర్లలో నడుస్తున్న తతంగం.**
**బాసర ట్రిపుల్ ఐటీ లో సీట్ల కోసం తెగింపు.**
**ఒక్కో విద్యార్థి నుంచి రూ" 60 వేలు వసూలు చేసినట్టు ఆరోపణలు.**
**పది నిమిషాల్లోనే ప్రశ్నపత్రం బయటకు.**
**సెల్ఫోన్తో ఫొటో తీసి షేర్ చేసినట్లు అనుమానం.**
**ఆలూరు కేంద్రంలో సీఎస్, డీవోలపై ఆరోపణలు**
**కలెక్టర్ ఆదేశాలతో ఇద్దరిని పోలీసులకు అప్పగించిన డీఈవో.**
**సీఎస్, డీవో, ఏడుగురు ఇన్విజిలేటర్ల సస్పెండ్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్**

పదవ తరగతి వార్షిక పరీక్షల్లో జిల్లాల్లోని రూరల్ ఏరియాల్లోని సెంటర్లలో మాస్ కాపీయింగ్ జోరు కొనసాగుతుంది. కంచె చేను మేసిన చందంగా కొంతమంది పరీక్ష విధులు నిర్వహిస్తున్న ఇన్విజిలేటర్ లు అక్రమాలకు పూనుకున్నట్టు తెలుస్తుంది. పరీక్ష మొదలైన 10 నిమిషాల్లోనే పేపర్ సెల్ఫోన్ లో సోషల్ మీడియా ద్వారా బయటకు పంపి


తేదీ: 18.03.2026.

పత్రికా ప్రకటన

తేదీ 18.03.2026 రోజున SSC పబ్లిక్ పరీక్షలు మార్చి 2026 కు సంబంధించిన రెండవ పరీక్ష అనగా 9 H (హిందీ) మరియు 9 T (తెలుగు) కి సంబంధించిన ప్రశ్న పత్రాలు జడ్.పి.హెచ్.ఎస్. ఆలూరు, జడ్.పి.హెచ్.ఎస్. మెండోరా మరియు గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ బోధన్ ల నుండి సోషల్ మీడియాలో వైరల్ అవ్వడానికి కారణమైన (09) మంది క్రింది సిబ్బందిని గౌరవ కలెక్టర్ గారి ఆదేశాల మేరకు విధుల నుండి తొలగించి సస్పెండ్ చేయడం జరిగింది.

1. Sri B Rajendhar, GHM, ZPHS Degaon, Aloor (M).
2. Sri T Vijay Kumar, SA, ZPHS Macherla, Aloor (M).
3. Sri P Umender, SGT, ZPHS Merdhapally, Aloor (M).
4. Sri N.Sagar, SGT, MPUPS Deekampally, Aloor (M).
5. Smt P.Mamatha, GHM, ZPHS SRSP, Mendora (M).
6. Sri G.Ravinder, SA, ZPHS Velgatoor, Mendora (M).
7. Sri Ch.Bupathi, SA, ZPHS SRSP, Mendora (M).
8. Sri K.Venu, SA, ZPHS Pentakalan, Bodhan (M).
9. Sri A.Shivananda Rao, SA, ZPHS Kaldurki, Bodhan (M).

తదుపరి పరీక్షలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు గుర్తించినచో కఠిన చర్యలు తప్పవని గౌరవ కలెక్టర్ తెలుపడం జరిగింది

జిల్లా విద్యాశాఖ అధికారి
నిజామాబాద్.



మాస్ కాపీయింగ్ కు పాల్పడినట్టు విచారణలో తేలింది. ఈ ఘటన ఆలూరు సెంటర్ తో పాటు మరికొన్ని చోట్ల చోటుచేసుకుంది. ముఖ్యంగా ఆలూరు కేంద్రంలో విధుల్లో ఉన్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు సెల్ఫోన్తో ప్రశ్నప త్రాన్ని ఫొటో తీసినట్లు విచారణలో గుర్తించారు. బాసర ట్రిపుల్ ఐటీ లో సీట్ల కోసం కొంతమంది ఈ కుట్రలకు తెరలేపినట్టు ప్రచారం జరుగుతుంది. సదరు ముఠా ఒక్కో విద్యార్థి తల్లిదండ్రుల నుంచి రూ" 60 వేలు వసూలు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**సీఎస్, డీవో, ఏడుగురు ఇన్విజిలేటర్ల సస్పెండ్: డీఈవో.**

మాస్ కాపీయింగ్ పై కలెక్టర్ సీరియస్ గా పరిగణించి, విచారణకు ఆదేశించారు. దీనితో ఘటనకు బాధ్యులైన ఆలూరు పరీక్ష కేంద్రానికి చెందిన సీఎస్ బి.రాజేందర్, డీవో టి.విజయ్ కుమార్, ఆలూరు, మెండోరా, బోధన్ పరీక్షకేంద్రాలలో ఇన్విజిలేటర్లు పి. ఉమేందర్, ఎన్.సాగర్, పి.మమత, జి. రవీందర్, సీహెచ్. భూపతి, కె. వేణు, ఎ. శివనందనరావును పరీక్ష విధుల నుంచి తప్పించి సస్పెండ్ చేసినట్లు డీఈవో పి. అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

**విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన.**

నిజామాబాద్ రూరల్ ఏరియాల్లోనీ సెంటర్లలోనీ పదవతరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ పై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది తప్పుడు విధానాల వల్ల కష్టపడి చదివిన విద్యార్థులకు నష్టం కలుగుతుందని పేర్కొంటున్నారు. దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మాస్ కాపీయింగ్ ను అరికట్టాలని కోరుతున్నారు.

**విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తూ.. విడుదల చేసిన పత్రిక ప్రకటన.**

# ఉద్యోగుల నగదు రహిత వైద్యానికి మోక్షం ఎప్పుడు.

**సమావేశాల ఆర్భాటమే కానీ... ఆచరణ ఏది!**
**ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్ను అమలుచేస్తూ వెంటనే జీ ఓ విడుదల చేయాలి.**

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్:**

రూ. 1.2 కోట్ల బీమాతో పాటు క్యాష్ లెస్ ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్ను ఫిబ్రవరి 23న జరిగిన మంత్రివర్గ సమావేశంలో కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఉద్యోగుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ సందర్భంగా సీఎంవో నుంచి ప్రకటన విడుదలైంది. ఉద్యోగులు, పెన్షనర్స్ తమ మూల వేతనాల నుండి 1.5 శాతం వైద్య నిధికి చెల్లించాలని, అంతే మొత్తం రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తూ హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి నాణ్యమైన కార్పోరేట్ స్థాయి నగదు రహిత వైద్య సౌకర్యాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించి దాదాపు నెల రోజులు కావస్తుంది. అంతకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ సంఘాలతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు అధ్యక్షతన అనేక సార్లు ఉన్నత స్థాయి సమావేశాలు జరిగాయి. ఉద్యోగ ఉపాధ్యాయులు పెన్షనర్లకు నగదు రహిత వైద్యాన్ని అందిస్తామని, ప్రమాదంలో చనిపోతే కోటి రూపాయల భీమా చేస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకపోవడం కడు


ఇంజమూరి రఘునందన్, (సెల్:9866102962), పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు.

విచారకరం. సమావేశాలు, ప్రకటనల వరకే పరిమితం అవుతున్న ప్రభుత్వ చర్యలపట్ల విశ్వాసం సన్నగిల్లుతుంది. ఉద్యోగ, ఉపాధ్యాయులు, రిటైర్ అయిన వారికి ఇవ్వాల్సిన ఉద్యోగ విరమణ బకాయిలు, ఇతర బిల్లులు సకాలంలో చెల్లించక పోవడం వల్ల వారు ఆర్థిక ఇబ్బందులతో, హోమ్ లోన్ బకాయిలు చెల్లించలేక, పిల్లల పెళ్లిళ్లు తదితర విషయాల్లో మానసిక ఆందోళనతో మంచాన పడడం, ఆసుపత్రుల పాలు కావడం జరుగుతుంది. అలాంటి పరిస్థితుల్లో సరైన సమయంలో వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో శస్త్ర చికిత్సలు కూడా వాయిదా వేసుకొని రావలసిన పెన్షన్ బకాయల కోసం ఎదురుచూస్తూ ఇప్పటికే మనో వేదనతో 60 కి పైగా పెన్షనర్లు మరణించారు. ఇది అత్యంత బాధాకరం. రావలసిన పెన్షన్ బకాయిలు రావడం లేదు. అమలు చేస్తామన్న నగదు రహిత వైద్యము అమల్లోకి రావడం లేదు. దీంతో ఉద్యోగులు, పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవడానికి నానా తంటాలు పడుతూ అప్పుల పాలవుతున్నారు. ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లాలంటేనే వంద సార్లు ఆలోచించి అప్పులు చేసి వైద్య బిల్లులు చెల్లిస్తూ చితికి పోతున్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల సందర్భంగానైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రకటించిన విధంగా ఉద్యోగుల నగదు రహిత వైద్య పథకానికి సంబంధించిన విధి విధానాల ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలనీ రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.

# హిందూ సమాజాన్ని జాగృతం చేయడంలో.. "ఆర్ఎస్ఎస్" పాత్ర కీలకం.





**ఉగాది ఉత్సవాల్లో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా .**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

హిందూ సమాజాన్ని జాగృతం చేయడంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పాత్ర ఎంతో కీలకమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని బస్వాగార్డెన్ లో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ... హిందువుల ప్రతి పండుగను మరియు ఆచార వ్యవహారాలను చాటి చెప్పడంలో ఆర్ఎస్ఎస్ ముందుంటుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో హిందువులు జాగృతమవడమే కాకుండా ఐక్యత పెరుగుతుందన్నారు. కేవలం సేవనే కాకుండా పండుగల విశిష్టతను తెలియజేయడం ఎంతో గర్వనీయమన్నారు. ప్రధానంగా ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు హెడ్గేవార్ పుట్టినరోజు కూడా ఉగాది రోజునే కావడం ఎంతో విశిష్టమైందన్నారు. దశాబ్దాల కాలం నుంచి ఆనవాయితీగా వస్తున్న సాంప్రదాయాలను పాటిస్తూ ముందుకు తీసుకెళు_న్నారన్నారు. అనంతరం పంచాంగ శ్రవణం చేసిన మాకునూరి పురుషోత్తమాచార్యులు గారిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ జక్కా రవి, తెలంగాణ ప్రాంత సహ బౌద్దిక్ ప్రముఖ్, ఇందూరు విభాగ్ ప్రచారక్ నర్రా వెంకట శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.





**అవినీతి పరులకు ఈ ఏడాది పరాభావం తప్పదు.**

అవినీతిపరులు, అక్రమాలు, అధర్మానికి పాల్పడే వారికి ఈ ఏడాది పరాభవం తప్పదని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్త తెలిపారు. జిల్లా కేంద్రంలోని కిషన్ గంజ్ లో గల ఆర్యవైశ్య సంఘం (పట్టణ) ఆధ్వర్యంలో ఉగాదిని పురస్కరించుకొని పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ, దాదాపు గత 52 సంవత్సరాలుగా వైశ్య సంఘానికి పంచాంగ శ్రవణం వినడానికి రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సనాతన ధర్మం ఆచార వ్యవహారాలు పాటించడంలో వైశ్యులు ముందుంటారని కొనియాడారు. కేవలం హిందూ సంస్కృతిని పాటించడమే కాకుండా అందరిని ఏకం చేయడంలో వైశ్యుల పాత్ర కీలకమన్నారు. హిందూ సాంప్రదాయం ప్రకారం జనవరి 1 నూతన సంవత్సర కాదని, ఉగాదినే కొత్త సంవత్సరమని తెలిపారు. యువత పోకడలకు పోకుండా ఉగాదిని నూతన సంవత్సరంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పంచాంగ శ్రవణం చేసిన వేద పండితులు బ్రహ్మశ్రీ వేలేటి గౌరీ శంకర్ శర్మ ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ 18 వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి రాము, బీజేపీ స్థానిక 34 డివిజన్ కార్పొరేటర్ బంటు ప్రవీణ్ (పండు), ఆర్యవైశ్య సంఘం (పట్టణ) అధ్యక్షులు ధన్పాల్ శ్రీనివాస్ గుప్తా, ప్రధాన కార్యదర్శి ఇల్లెందుల ప్రభాకర్ గుప్తా, కోశాధికారి గాలి నాగరాజు గుప్తా, కన్వీనర్లు లాబిశెట్టి శ్రీనివాస్ గుప్తా, పార్శి మారుతి గుప్తా, సుధాకర్ గుప్తా, రాజా ప్రతాప్ గుప్తా, నేతి మోహన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# "జడ కొప్పు" కార్యక్రమంలో పాల్గొన్న సీపీ.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



ఉగాది పండుగ పురస్కరించుకొని దుపెల్లి గ్రామం, రెంజల్ మండలంలో గురువారం భక్త ఆంజనేయస్వామి హనుమాన్ మందిరంలో జరిగిన జడ కొప్పు కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య పాల్గొన్నారు. కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా జరిపిస్తున్న జూపల్లి గ్రామ అభివృద్ధి కమిటీకి అదేవిధంగా భక్తిశ్రద్దలతో కోలాటల్లో జడ కొప్పు ఆడుతున్న సభ్యులకు పోలీస్ కమీషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎ.సి.పి శ్రీనివాస్, రెంజల్ ఎస్.ఐ చంద్రమోహన్ , దూపల్లి గ్రామ సర్పంచ్ ధనుర్ నరసవ్వ సాయి రెడ్డి , ధూపెల్లి గ్రామ ఎక్స్ సర్పంచ్ భూమారెడ్డి , ఎక్స్ సొసైటీ చైర్మన్, గ్రామ అభివృద్ధి సభ్యులు బాబన్న, లింగం, మహేష్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ గా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం.

**- శాసన సభ, శాసన మండలికి కొత్త విప్ లను నియామకం.**

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్:**



అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వేళ రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. శాసన సభ, శాసన మండలికి కొత్త విప్ లను నియమించింది. శాసన సభలో ప్రభుత్వ విప్ లుగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావులను నియమించింది. శాసన మండలిలో ప్రభుత్వ విప్లుగా అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామాకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# హిందూ ధర్మ పరిరక్షణకు టీవి5 కృషి.

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ.**
**టీవి5, హిందూ ధర్మం చానల్స్ రూపొందించిన పంచాంగం ఆవిష్కరణ.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

హిందూ ధర్మ పరిరక్షణ కోసం టీవి5 చేస్తున్న కృషి అభినందనీయమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. తెలుగు నూతన సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని టీవి5- హిందూ ధర్మం చానల్స్ ఆధ్వర్యంలో రూపొందించిన పంచాంగం ను ఎమ్మెల్యే గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పరాభవనామ సంవత్సరంలో హిందూ ధర్మం మరిన్ని విజయాలు



సాధించాలని ఆకాంక్షించారు. టీవి5 చైర్మన్ గా, టిటిడి చైర్మన్ గా సనా తన ధర్మాన్ని కాపాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్న బీఆర్ నాయుడుకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీవీ5 ఉమ్మడి జిల్లా ప్రతినిధి బైర శేఖర్, సీనియర్ జర్నలిస్టులు బొబ్బిలి నర్సయ్య, చింతల గంగాదాస్, కుంచె వెంకటేష్, సిరిగాధ ప్రసాద్, గంగారెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చలాన్లు చెల్లించకపోతే డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ ఫ్రీజ్!



హైదరాబాద్: రోడ్లపై పదేపదే నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడుతున్నారా? ట్రాఫిక్ చలాన్లు సకాలంలో చెల్లించకుండా వదిలేస్తున్నారా? ఇకపై అలాచేస్తే మీ డ్రైవింగ్ లైసెన్స్, వాహనం ఆర్సీ ఫ్రీజ్ కావచ్చు. వాటికి సంబంధించిన ఆర్టీఏ సేవలు ఆగిపోతాయి. ఈ ప్రక్రియను అమలు చేసేందుకు రవాణాశాఖ సిద్ధమవుతోంది. ట్రాఫిక్ జరిమానాలపై వాహనదారుల నుంచి వస్తున్న ఫిర్యాదులను వేగంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకురానుంది. కేంద్ర మోటార్ వాహన నిబంధనల ప్రకారం జరిమానాలపై అభ్యంతరాలను పరిష్కరించేందుకు గ్రీవెన్స్ రెడ్రెసల్ అథారిటీని నియమించనుంది. ప్రాథమిక నోటిఫికేషన్ ఒకట్రెండు రోజుల్లో జారీ కానున్నట్లు సమాచారం.